సంపద సృష్టించే వర్గాలపై మోడీ కక్ష

- ధనవంతులకు సానుకూలంగా చట్టాల్లో మార్పులు
- బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు
- 26న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలారాయడమే కాక, రాష్ట్రాల హక్కులను, హరిస్తూ చట్టాలను చేసింది. ఒక వైపున ప్రజాసంక్షేమం గురించి వల్లిస్తూనే..మరో వైపు కార్పొరేట్లకు లక్షల కోట్లు దోచిపెడుతున్నది. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లు,వీబీజీ రాంజీ, విత్తన బిల్లు,విద్యుత్ సవరణ చట్టం తదితర చట్టాలను తీసుకొచ్చి కార్మికుల, రైతుల, వ్యవసాయ కార్మికుల హక్కులను కాలరాసింది'. ఈ విధానాలను నిరసిస్తూ.. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా కొన్ని సూచనలతో ఆమోదించారు.

ఆందోళనలు..పోరాటాలు..

కేంద్ర ప్రభుత్వం దేశ కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలకు సమస్త ప్రజానికానికి సవాలు విసిరింది. 'అవును..మా ప్రభుత్వం సంపన్నులు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ల కోసమే పని చేస్తాం. ఎం చేసుకుంటరో చేసుకోండి'. అన్నట్టుగానే కార్మిక, కర్షకులకు వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేసేందుకు బరితెగించి ముందుకొస్తున్నది. దీన్ని వెనక్కి కొట్టాలంటే పోరాటాలే ఎకైక మార్గం ఎంతటి వారైనా ప్రజాఉద్యమాలకు తలవంచాల్సిందే.. సంయుక్తంగా మూడు సంఘాలు పిలుపు నిచ్చాయి. ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను నిర్వహించాలనీ, జనవరి 8నుంచి 18వరకు వాహన జాతాలు నిర్వహించాలనీ, జనవరి 19న కార్మిక, కర్షక ఐక్యతా దినం సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభావ వంతంగా ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

సంపద సృష్టిస్తున్న వర్గాలపై మోడీ కక్ష :చుక్క రాములు

ఈ దేశ జిడిపిని పెంచే వర్గాలు, సంపద సృష్టించే ఉత్పత్తి వర్గాల పట్ల మోడీ ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతున్నదని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు విమర్శించారు. పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం మొన్నటి వరకు కార్మికుల తొలగింపు అత్యంత కష్టతరంగా ఉండేది.కానీ..కేంద్రం తాజాగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లు ఫైర్ అండ్ హైర్ విధానానికి అనుమతిస్తున్నదని చెప్పారు. మానవీయ పరిస్థితులు, తొలగింపు పరిహారాలు ఇవన్నీ లేకుండానే నియమించుకునే, తొలగించే స్వేచ్ఛను యాజమాన్యాలకు లేబర్ కోడ్‌లు ఇస్తున్నదని తెలిపారు. ఈ రకమైన కార్మిక వ్యతిరేక విధానాలు ఆ కోడ్‌ల ద్వారా యాజమాన్యాలకు అనుకూలంగా ఉన్నాయనీ, అందుకే వీటిని రద్దు చేసే వరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

"వికసిత్ భారత్- జి రామ్ జో" చట్టాన్ని రద్దు చేయాలి
జి నాగయ్య వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు

వామపక్షాల పోరాట ఫలితంగా 2005లో "మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారంటీ చట్టం - 2005"ను భూస్థాపితం చేసేందుకు మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య విమర్శించారు.చట్టం స్థానంలో పథకాన్ని తీసుకొచ్చిందనీ, ఈ పథకం పేదలకు పెద్దగా ఉపయోగం లేదని చెప్పారు. చట్టాన్ని రూపొందేంచే నాడే..మోడీ దీనికి వ్యతిరేకంగా మాట్లాడారనీ, ఇది విఫల చట్టమని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. చట్టంలోని జీవాన్నంతా పిండేసి సారం లేని పథకాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. విబిజి రాంజీని రద్దు చేసి పాత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆ రకమైన నిర్ణయం తీసుకునేంత వరకు పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

రైతు వ్యతిరేక బిల్లులను రద్దు చేయాలి
పి సుదర్శన్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు

కార్పొరేట్ అనుకూల జాతీయ విత్తన బిల్లు, 2003 విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి సుదర్శన్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఒంటెత్తు విధానాలతో కార్మికుల, కష్టజీవులపై దాడికి పూనుకున్నదని విమర్శించారు. కార్మికులు, కర్షకులపై మాత్రమే దాడి కాదనీ, మొత్తం ఫెడరిలిజం, ప్రజాస్వామ్యంపై దాడికి తెగబడిందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విత్తన బిల్లు విద్యుత్ చట్టం అమలైతే...రైతులు, ప్రజలు తీవ్ర కష్టాలెదుర్కుంటారని చెప్పారు. అందుకే రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అబద్ధాలతో ఊదరగొడుతున్న బిజెపి : పాలడుగు భాస్కర్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక,కర్షక, ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి వారి జీవితాలపై తీవ్ర ప్రతి కూల ప్రభావాన్ని వేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మందబలంతో పార్లమెంట్‌లో తీసుకొచ్చిన బిల్లులు, చట్టాలను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. అప్పటి వరకు పోరాటాలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి : టి సాగర్

విద్యుత్ సవరణ చట్టాన్ని, విత్తన బిల్లును వెంటనే ఉపసంహారించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. విత్తన చట్టం పూర్తిగా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే రూపొందించారనీ, మేధావులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు ఈ చట్టాన్ని బహిష్కరించాలని పిలుపు ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్ర చట్టం మోడల్ గా పెట్టి రాష్ట్రాలే చట్టాలు చేయాలని తీర్మానాలు చేసి. కేంద్రానికి పంపారని తెలిపారు. విద్యుత్ చార్జీలు కేంద్రమే "విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్" ద్వారా నిర్ణయిస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి టారిఫ్ ముందుగానే వసూలు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత విద్యుత్ రద్దు చేస్తారని చెప్పారు. క్రాస్ సబ్సిడీ రద్దు చేయడం వల్ల వినియోగదారులందరు. ఉత్పత్తి ఖర్చు చెల్లించాలని చెప్పారు. ఇది రైతాంగానికి ప్రజలకు తీవ్ర నష్టమని చెప్పారు. పార్లమెంట్ ఆమోదించిన విద్యుత్ సవరణచట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

విస్తృత ప్రచారం నిర్వహించాలి

ఎఐకెఎస్, సిఐటియు సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, ఎస్ వీరయ్య మాట్లాడుతూ కేంద్ర బిజెపి సర్కార్ పభుత్వ రంగ సంస్థల్లోకి 100శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ నిర్ణయం చేసిందని చెప్పారు. ముఖ్యంగా ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించిందన్నారు. ఈ నిర్ణయం విదేశీ బహుళ జాతి కంపెనీలకు మన ఇన్సూరెన్స్ రంగాన్ని అప్పగించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తన బిల్లు, విత్తన చట్టం వల్ల ప్రజలకు తీవ్ర నష్టాలు వాటిల్లుతాయని హెచ్చరించారు. వీటికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రూప్ మీటింగ్‌లు, సెమినార్లు, జాతాలు, కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజానీకంలో విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

పని హక్కును కాలరాస్తే ఉద్యమం : ఆర్ వెంకట్రాములు

పని హక్కుని కాలరాస్తే ఉద్యమం తప్పదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు హెచ్చరించారు. ఉపాధి హామీ స్థానంలో జి రామ్ జీ పథకాన్ని తీసుకురావడం దారుణమన్నారు. ఉపాధి హామీ పథకం చాలా కాలంగా చూపుతున్న వ్యతిరేకతకు పరాకాష్ట ఈ నిర్ణయమని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయకార్మికులు, రైతులు,కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఆసన్నమైందని చెప్పారు. రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, సిఐటియూ ఆఫీసు బేరర్లు పాల్గొన్నారు.

చేతివృత్తులకు ఇండియా క్రాఫ్ట్‌మేళా అండగా నిలవాలి

- భారతీయ కళానైపుణ్యం ఉట్టిపడేలా క్రాఫ్ట్‌మేళా : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భారతీయ కళా నైపుణ్యం గల చేతి వృత్తులు అంతరించకుండా ఇండియా క్రాఫ్ట్ మేళా అండగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళాని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని హ్యాండ్లూమ్ అవార్డు గ్రహీతలు, హ్యాండ్లూమ్ కంపెనీలకు, సహకార సంఘాలకు సంబంధించిన 100కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. ఈ మేళా జనవరి ఐదో తేదీ వరకు కొనసాగుతుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా క్రాఫ్ట్ మేళాకు శిల్పారామం వేదికైందనీ, ప్రజలు క్రాఫ్ట్ మేళా సందర్శించి చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

కుటుంబ సహకారంతోనే నాయకుల ప్రజా పోరాటాలు

- సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- వి శ్రీనివాసరావుతో కలిసి బండారు చందర్రావు సతీమణినికి పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై నిరంతరాయంగా పోరాటాలు నిర్వహించే నాయకులకు కుటుంబసభ్యుల సహకారం ఎంతో అవసరమని, నాయకుల పోరాట చరిత్రలో వారి పాత్ర మరువలేనిదని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఆదివారం బండారు చందర్రావు సతీమణి బండారు సత్యవతిని బీవీ రాఘవులు, సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శించారు. ఆమె ఆరోగ్యంపై ఆరా తీసి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్ ఉద్యమ నిర్మాతలైన బండారు చందర్రావు, బత్తుల భీష్మారావు, ఎలమంచి సీతారామయ్య, పీవీఆర్ చంద్రం, శ్యామల వెంకట్ రెడ్డి తదితర నాయకులు కుటుంబ సభ్యుల సహకారంతోనే ఈ ప్రాంతంలో పార్టీని నిర్మించగలిగారని అన్నారు. ప్రతిరోజూ ఎంతోమంది కార్యకర్తలు వివిధ పనుల నిమిత్తం భద్రాచలానికి వచ్చిన సందర్భంలో బండారు చందర్రావు ఇంటికి వస్తే.. ప్రతి ఒక్కరికి సత్యవతి భోజనం పెట్టి మరీ పంపించేదని గుర్తు చేశారు. చందర్రావు ఇల్లు అంటే పార్టీ కార్యాలయంగానే పిలిచేవారని అన్నారు. చందర్రావు.. ఎమర్జెన్సీ సమయంలో అజ్ఞాతంలో గడిపినప్పుడు కూడా చిన్నపిల్లలతో బండారు సత్యవతి ఎంతో ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాటాలు నిర్వహిస్తున్న బండారు చందర్రావుని మావోయిస్టులు అత్యంత దారుణంగా హత్య చేసినప్పటికీ సత్యవతి ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా తన ఇద్దరు కుమారులను పార్టీకి అందించి ఆదర్శంగా నిలిచారని అన్నారు. బండారు సత్యావతికి సంబంధించి పార్టీ నాయకుల కుటుంబాలే బంధువులని,వారితోనే ఇప్పటికీ సత్సంబంధాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఉద్యమానికి బండారు సత్యవతి ఇచ్చినస్ఫూర్తిఅభినందనీయమని కొనియాడారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన చందర్రావు, భీష్మారావు : వి.శ్రీనివాసరావు

బండారు చందర్రావు, బత్తుల భీష్మారావు మరణించి 40 సంవత్సరాలు గడిచినప్పటికీ ఆ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. బండారు చందర్రావు, బత్తుల భీష్మారావు పేర్లతో చింతూరు మండల కేంద్రంలో నిర్వహించిన అమరవీల సంస్కరణ సభ ముంపు మండలాల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిందని తెలిపారు. చందర్రావు, భీష్మారావు స్ఫూర్తితో వారి కుటుంబ సభ్యులు ఉద్యమాన్నికొనసాగిస్తూ ఉద్యమకారు లకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. బండారు సత్యవతి తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైనప్పటికీ ఇప్పటికీ తనలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలన్న ఆసక్తి కనిపిస్తుందని, అది కేవలం విప్లవ పార్టీ కార్యకర్తలకే సాధ్యమవుతుందని అన్నారు. బండారు సత్యవతి సలహాలు, సూచనలు నేటితరం కార్యకర్తలకు ఎంతో అవసరమని తెలిపారు. ఈ పరామర్శలో సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, భద్రాద్రి జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రశెట్టి వెంకట రామారావు ఉన్నారు.

కెనరా బ్యాంక్ / केनरा बैंक Canara Bank
(A Government Of India Undertaking)
రీజినల్ ఆఫీస్ వెస్ట్
చిత్రాపూర్ మఠ్ కాంప్లెక్స్, మల్లేశ్వరం, 15వ క్రాస్, బెంగళూరు-560055.

రుణగ్రహీతలు/హామీదారులు/ తాకట్టుదారులకు (సెక్షన్ 13(2)) డిమాండ్ నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద జారీచేయబడిన నోటీసు.

క్రింది సంతకందారు కెనరా బ్యాంక్, రీజినల్ ఆఫీస్ వెస్ట్, బెంగళూరు యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును, దిగువ పేర్కొన్నట్లు బ్యాంకుకు చూపిన చిరునామాలకు, అక్నాలెడ్జిమెంట్ డ్యూ (ఆర్‌పిఎడి)తో స్పీడు పోస్టు ద్వారా జారీచేశారు. అట్టి స్పీడు పోస్టు నోటీసుకు అక్నాలెడ్జిమెంట్ అందకనే మరియు సదరు చిరునామాలో వారు అందుబాటులో లేరని/ఆర్‌పిఎడి ద్వారా పంపిన నోటీసులను నివారిస్తున్న కారణంగా వెనుదిరిగినవి. నోటీసు వారికి బట్వాడా కాలేదు. సదరు నోటీసులోని విషయాన్ని ఇందు దిగువ పేర్కొనుట జరుగుతుంది.

1. రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు/ తాకట్టుదారులు/ హామీదారుల పేరు & చిరునామా: శ్రీ ఎం.డి. షేక్ సాదిఖ్ తండ్రి షేక్ మస్తాన్‌వలి, నం.24-108/4బి, ప్లాట్ నం.48, రోడ్ నం.1, కిరణ్ విల్లా, మారుతి నగర్, లోతుకుంట, తిరుమలగిరి, తెలంగాణ-500015. 1ఎ. శ్రీ ఎం.డి. షేక్ సాదిఖ్ తండ్రి షేక్ మస్తాన్‌వలి, నం.1-1-180/17, ఘూన్సి లాడ్జ్ బిల్డింగ్, ఆర్‌టిసి క్రాస్ రోడ్, చిక్కడపల్లి, హైదరాబాద్, తెలంగాణ-500020.

రుణగ్రహీతచేత పొందిన రుణ సదుపాయాల వివరాలు :

లోన్ పరిమితి యొక్క లోన్ నెం. స్వభావం	మంజూరు తేది	మంజూరైన మొత్తాలు (రూ.)	తేది : 15.12.2025 నాటికి వడ్డీతో బకాయి	వడ్డీ రేటు
160002178619 ఇంటి రుణం	12/02/2024	Rs. 1,32,00,000/-	Rs. 83,62,263.86	7.20%P.A.+2% (పెనల్ వడ్డీ)

పూర్తి బకాయి మొత్తాలు : రూ. 83,62,263.86 (రూపాయలు ఎనభై మూడు లక్షల అరవై రెండు వేల రెండు వందల అరవై మూడు మరియు ఎనభై ఆరు పైసలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ & ఇన్సిడెంటల్ వ్యయాలు & ఖర్చులతోసహా.

ఎన్‌పిఎ తేది : 11.12.2025 డిమాండ్ నోటీసు తేది : 16.12.2025

టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ ఎం.డి. షేక్ సాదిఖ్

స్థిరాస్తి వివరాలు :

షెడ్యూలు 'ఎ' ఆస్తి: ఐటెం నం.1 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/61/2014-15, తేది: 16.01.2014 ఆధారంగా సర్వే నం.69, కొలతలు 2 ఎకరాల 02 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: శ్రీ రామస్వామి రెడ్డికు చెందిన ఆస్తి, పడమర: శ్రీ హొసహల్లి గుల్లయ్యకు చెందిన ఆస్తి, ఉత్తరం: శ్రీ సాంబయ్యకు చెందిన ఆస్తి, దక్షిణం: శ్రీ హెచ్.ఎం.కృష్ణప్పకు చెందిన ఆస్తి.

ఐటెం నం.2 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.73, కొలతలు 1 ఎకరం 03 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: సర్వే నం.76, పడమర: సర్వే నం.69, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: సర్వే నం.72.

ఐటెం నం.3 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 0 ఎకరాల 13 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: శ్రీ ముత్తప్పకు చెందిన ఆస్తి, పడమర: శ్రీ రామస్వామి రెడ్డికు చెందిన ఆస్తి, ఉత్తరం: రాజ కాలువ, దక్షిణం: శ్రీ రమేశ్ రెడ్డికు చెందిన మిగతా ఆస్తి.

ఐటెం నం.4 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 0 ఎకరాల 13 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: శ్రీ గుల్లప్పకు చెందిన ఆస్తి, పడమర: శ్రీ సాంబయ్యకు చెందిన ఆస్తి, ఉత్తరం: కాలువ, దక్షిణం: మెసర్స్ అసోసియేటెడ్ డ్వెల్లింగ్స్ ప్రై. లిమిటెడ్‌కు చెందిన మిగతా ఆస్తి.

ఐటెం నం.5 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 0 ఎకరాల 14 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: అదే సర్వే నం.74లో మిగతా ఆస్తి, పడమర: అదే సర్వే నం.74లో మిగతా ఆస్తి, ఉత్తరం: కాలువ, దక్షిణం: సర్వే నం.73&69.

ఐటెం నం.6 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 0 ఎకరాల 12 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: అదే సర్వే నం.74లో మిగతా ఆస్తి, పడమర: సర్వే నం.64& కాలువ, ఉత్తరం: కాలువ, దక్షిణం: సర్వే నం.69.

ఐటెం నం.7 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/99/2014-15, తేది: 16.03.2015 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 0 ఎకరాల 12 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: శ్రీ ముత్తప్పకు చెందిన గతంలోని ల్యాండ్, పడమర: కీ॥శే॥ శ్రీ సాంబయ్యకు చెందిన ఆస్తి, ఉత్తరం: రాజ కాలువ, దక్షిణం: శ్రీ భాస్కర్ రెడ్డి ఆస్తి, ప్రస్తుతం రమేశ్ రెడ్డికు చెందిన ల్యాండ్.

ఐటెం నం.8 : బెంగళూరు అర్బన్ జిల్లా, జిగని హొబ్లి, హెన్నాగర అమానికెరె గ్రామం వద్దగల కన్వర్షన్ ఆర్డర్ నం. ఎఎల్ఎన్(ఎజె)ఎస్ఆర్/02/2014-15, తేది: 05.09.2014 ఆధారంగా సర్వే నం.74, కొలతలు 1 ఎకరాల 24 గుంటలతో నివాసితిగా మార్చిన స్థిరాస్తి యొక్క మొత్తం భాగం మరియు సరిహద్దులు: తూర్పు: సర్వే నం.75 & 77, పడమర: సర్వే నం.73,72 & సర్వే నం.71, ఉత్తరం: సర్వే నం.75, దక్షిణం: రోడ్డు.

షెడ్యూలు 'బి' ఆస్తి : కంపోజిట్ షెడ్యూలు ఆస్తిలో "క్యాస్టిలేటన్ గ్రీన్స్" వద్ద షెడ్యూలు 'ఎ' ఆస్తి లో హక్కు, టైటిల్ & ఇంటెరెస్ట్‌తో 1468 చ.అ.ల విడదీయలేని ల్యాండ్ భాగం. సరిహద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: యూనిట్ నం.76, ఉత్తరం: యూనిట్ నం.74, దక్షిణం: రోడ్డు.

షెడ్యూలు 'సి' ఆస్తి : 2474చ.అ.ల (భవనాల మధ్య గోడలు, సీలింగ్ అంతస్తులుతో ఏవైతే) సూపర్ బిల్ట్-అప్ ఏరియా కలిగిన షెడ్యూలు 'ఎ' ఆస్తి లో నిర్మించిన "క్యాస్టిలేటన్ గ్రీన్స్" గా పేరుగల భవనము యొక్క గ్రౌండ్ & మొదటి అంతస్తు పై 3 బెడ్ రూమ్ నివాసిత యూనిట్ నం.75.

ఇందు పై పేర్కొనబడిన సదరు మొత్తాలను, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా, కెనరా బ్యాంక్ కు చెల్లించవలసిందిగా మిమ్ములను కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, కెనరా బ్యాంక్ రుణగ్రహీతలు & హామీదారులు యొక్క హామీచూపిన ఆస్తులను స్వాధీనంచేసుకొనుటతోసహా సెక్యూర్డ్ అసెట్స్‌పై, సదరు చట్టం యొక్క నియమాల క్రింద అవసరమైన చర్యలను తీసుకొంటుంది. దిగువ వాటితోసహా కెనరా బ్యాంక్ కు సంక్రమించిన అధికారాలు : (1) సెక్యూర్డ్ అసెట్స్ రియలైజింగ్ కొరకు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు హక్కులతోసహా రుణగ్రహీతలు / హామీదారులు / తాకట్టుదారులు యొక్క సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొను అధికారాలు, మీచేత చేయబడిన ఏవేని ట్రాన్స్‌ఫర్‌గా బదిలీచేయబడిన సెక్యూర్డ్ అసెట్స్, రియలైజేషన్‌లో లేదా ట్రాన్స్‌ఫెరీ హక్కుల్లో కెనరా బ్యాంక్ వెస్ట్ చేయుట ద్వారా, బ్యాంకు యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేనిదే బ్యాంకుకు హైపోతికేట్ / తాకట్టుచేసిన వాటిని కూడా మరియు డిమాండ్‌నోటీసులో పేర్కొన్న హామీచూపిన ఆస్తులు ఏవేనిని, అమ్మకం, లీజు లేదా ఇతర విధానాలు (సాధారణంగా వ్యాపారం నిర్వహించుట మినహా) ద్వారా కాని బదిలీచేయుట నుండి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) యొక్క నియమాలలో మీరు నిషేదింపబడినారు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) యొక్క నియమాలలో ఈ నోటీసు జారీచేయనైనది.

తేది : 18.12.2025
ప్రదేశం : బెంగళూరు
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

నాణ్యమైన విద్యనందించడమే సర్కారు లక్ష్యం

- ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడంతో పాటు మానవ విలువలు, సామాజిక చైతన్యం కలిగే విద్యను అందించేందుకు పాఠశాలలు కృషి చేయాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ సర్కిల్‌లోని మెరీడియన్ స్కూల్ అస్థిత్వ 4.0 పేరుతో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో మంత్రితోపాటు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రయివేట్ విద్యాసంస్థల స్థాయిలోనే నాణ్యమైన విద్యను పొందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. విలువలతో కూడుకున్న విద్యను అందించడంలో మెరీడియన్ స్కూల్ యాజమాన్యం కృషి ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్లు మాధురి, రాంగోపాల్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యకలాపాలు, క్రీడలు, స్వీయరక్షణ, క్రమశిక్షణ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ శైలజా రెడ్డి.. తమ విద్యాసంస్థ విద్యా విధానాలను వివరించారు. కాగా, విద్యార్థులు ఆకట్టుకునే సాంస్కృతిక ప్రదర్శనలు చేసి ఆహూతులను అలరించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్ పాల్గొన్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

- సుమారు రూ.3 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని శ్రీ సమర్థ్ కోటేక్స్ కాటన్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి మిల్లు నుంచి మినీ ట్రాక్టర్ ద్వారా పత్తిని తరలిస్తున్న క్రమంలో ట్రాక్టరులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దాంతో ఫ్యాక్టరీలోకి క్షణాల్లో మంటలు వ్యాపించి చుట్టుపక్కల ఉన్న పత్తిని అంటుకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో సంఘటనా స్థలానికి చేరుకొని సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఖేడ్ డిఎస్‌పి వెంకటరెడ్డి, కంగ్టి సిఐ, ఎస్ఐ.. పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును ఫ్యాక్టరీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా, ఈ ప్రమాదంలో 3వేల టన్నులకు పైగా పత్తి కాలిపోయిందని, సుమారు రూ.3 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్టు సంస్థ యజమాని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

బుక్‌ఫెయిర్ లెక్కలు చూపలేదు

- అందుకే చంద్రమోహన్‌కు స్టాల్ నిరాకరించాం
- కవులు, మేధావులు, రచయితలు వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం : యాకూబ్, ఆర్ వాసు, బాల్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'హైదరాబాద్ బుక్ ఫెయిర్(హెచ్‌బీఎఫ్)కు 2014 నుంచి 2022 వరకు కొనసాగిన కార్యవర్గం హయాంలో బ్యాంకు ఖాతాల నిర్వహణ, నిధుల మళ్లింపుపై అనేక అనుమానాలున్నాయి. హెచ్‌బీఎఫ్‌కు అధికారిక బ్యాంకు ఖాతా ఉండగానే ది హైదరాబాద్ బుక్‌ఫెయిర్ పేరుతో పాత కమిటీ బ్యాంకు ఖాతా నిర్వహించడం, ఆ ఖాతా నుంచి రూ.32 లక్షలను ఓ కన్వెన్షన్ సెంటర్‌కు దారిమళ్లించడం, పదవీకాలం అయిపోగానే ఆ ఖాతా క్లోజ్ చేయించడం వంటి అంశాలపై వివరాలు అడిగితే అప్పటి అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న జూలూరి గౌరీశంకర్, చంద్రమోహన్, కోశాధికారిగా ఉన్న రాజేశ్వరరావు దాటవేస్తున్నారు. లెక్కలు చూపకపోవడం, బుక్‌ఫెయిర్ కమిటీకి విరుద్ధంగా వ్యవహరించడం వల్లనే చంద్రమోహన్‌కు స్టాల్ ఇవ్వడానికి నిరాకరించాం. వివరాలు చెప్పాలని పలుమార్లు లేఖలు రాసినా స్పందించలేదు. వివరాలివ్వకపోతే ఈ సారి స్టాల్ ఇవ్వబోమని మే నెలలోనే స్పష్టం చేశాం. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగా స్టాల్ కేటాయించలేదని సోషల్‌మీడియా వేదికగా చంద్రమోహన్ ప్రచారం చేయడం తగదు. తెలంగాణ సమాజానికి అన్యాయం జరుగుతున్నట్టు ప్రచారం చేయడం దుర్మార్గం. కవులు, మేధావులు, రచయితలు, ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. బుక్‌ఫెయిర్‌కు సంబంధించిన లెక్కలను వారం రోజుల్లో చూపుతానని చంద్రమోహన్ లిఖితపూర్వకంగా హామీనిస్తే స్టాల్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గల హైదరాబాద్ బుక్‌ఫెయిర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 1986 నుంచి కాచిగూడలోని బీఓఐలో అధికారిక ఖాతా ఉండగా.. రిజిస్ట్రేషన్ లేకుండానే 2021లో ఐసీఐసీఐ బ్యాంకులో, 2016లో ఎస్‌బీఐలో కొత్త ఖాతాలు ఎందుకు తెరవాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఎస్‌బీఐ ఖాతా నుంచి 2018లో ఒక కన్వెన్షన్ సెంటర్‌కు సుమారు రూ. 11.50 లక్షలు చెల్లించడం వెనుక ఆంతర్యమేంటని నిలదీశారు. 2017 మార్చి నెలలో 15 రోజుల్లోనే నగదును పెద్ద ఎత్తున ఎందుకు ఉపసంహరించారు? అంత అవసరం ఏమొచ్చింది? గతంలో నిర్వహించిన 8 ప్రదర్శనలకు సంబంధించి ఫుడ్ స్టాల్స్, టికెట్ల విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం బ్యాంకు ఖాతాల్లో ఎందుకు జమ చేయలేదు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హెచ్‌బీఎఫ్‌కు అధికారిక బ్యాంక్ ఖాతా ఉండగా, 'ది హైదరాబాద్ బుక్ ఫెయిర్' పేరిట రిజిస్ట్రేషన్ లేని మరో అకౌంట్‌ను తెరిచి నిధులు దారిమళ్లించారని ఆరోపించారు. ఎస్‌బీఐ ఖాతా నుంచి ఒక కన్వెన్షన్ సెంటర్‌కు రూ. 32 లక్షలు బదలాయించారనీ, రూ.10 లక్షల నగదు విత్ డ్రా చేశారని ఆధారాలతో సహా వెల్లడించారు. జిల్లాల్లో జరిగిన ప్రదర్శనలకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం, టికెట్లు, ఫుడ్ కోర్టుల ద్వారా వచ్చిన ఆదాయం ఎక్కడా బ్యాంకులో జమ చేయలేదని ఎత్తిచూపారు. నిధుల దుర్వినియోగంపై మూడు సార్లు నోటీసులు ఇచ్చినా గత బాధ్యులు స్పందించలేదన్నారు. కమిటీ సమావేశంలో వారి సభ్యత్వాలను తాత్కాలికంగా రద్దు చేసి 'బ్లాక్ లిస్ట్'లో పెట్టాలని నిర్ణయించామన్నారు. పదేండ్లుగా ఐటీ రిటర్న్ ఫైల్ చేయలేదనీ, అసలు క్యాష్ బుక్, ఓచర్లు కూడా అప్పగించలేదని ఎత్తి చూపారు. కొత్త కార్యదర్శి ఎన్నికైనా పాతవారే సిగ్నేటరీలుగా కొనసాగడం తీవ్ర ఆర్థిక నేరం కిందకే వస్తుందన్నారు. బుక్ ఫెయిర్ కార్యాలయాన్ని సొంత అవసరాలకు వాడుకోవడాన్ని ఎత్తిచూపారు. ఈ అక్రమాలపై వివరణ ఇవ్వాలని గత కమిటీ బాధ్యులైన జూలూరి గౌరీశంకర్, కోయ చంద్రమోహన్, పి. రాజేశ్వరరావులకు మూడుసార్లు లేఖలు రాసినా స్పందన లేదన్నారు. వివరణ ఇవ్వాల్సింది పోయి.. సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుత కమిటీపై బురద చల్లడాన్ని తీవ్రంగా ఖండించారు.

SBI స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా
యస్‌యమ్‌ఇ బ్రాంచి బిసెంట్ రోడ్ బ్రాంచి (బ్రాంచ్ కోడ్ : 63640), డోరు నెం.27-129-42 & 27-06-106, గ్రావిటీ టవర్స్, 2వ అంతస్థు, ప్రకాశం రోడ్, విజయవాడ-520002. ఫోన్: 0866-2572192, 2571893, Email: sbi.63640@sbi.co.in

ఋణగ్రహీత, హామీదారుకు సంక్షిప్త డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2)కు లోబడి జారీచేయబడిన నోటీసు)

ఋణగ్రహీత మరియు హామీదారుల పేర్లు, చిరునామా		ఋణము, ఖాతా నెం.& చెల్లించవలసిన మొత్తము	
ఋణగ్రహీత : మెస్సర్స్ ఆర్య ప్రాజెక్ట్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ : శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, డోరు నెం.59ఎ-11-3ఎ, 2వ అంతస్థు, ప్లాట్ నెం.6, 2వ లెఫ్ట్, కెపి నగర్, బెంజి సర్కిల్, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్:520001, హామీదారులు : 1) శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్, 2-9, చల్లపల్లి, కృష్ణా జిల్లా, పిన్:521126, 2) శ్రీమతి చుక్కపల్లి శ్రావణి, భర్త : సజ్జా నితిన్ చక్రవర్తి, ఫ్లాట్ నెం.4, షారోన్ అపార్ట్‌మెంట్స్, మెతోడిస్ట్ కాలనీ, బేగంపేట, హైదరాబాద్, పిన్ : 500016, 3) శ్రీ సజ్జా సురేష్, తండ్రి : సుబ్బారావు,2-9, చల్లపల్లి, కృష్ణా జిల్లా, పిన్:521126.		క్యాష్ క్రెడిట్ లోన్ అకౌంట్ నెం.43438101729	
డిమాండ్ నోటీసు తేది	20-11-2025	యన్‌పిఎ తేది	11-11-2025
బకాయి మొత్తం: ది.20-11-2025 నాటికి రూ.5,05,54,514/- (అక్షరాల ఐదు కోట్ల ఐదు లక్షల యాభైనాలుగు వేల ఐదు వందల పద్నాలుగు రూపాయలు మాత్రము) ప్లస్ ది.20-11-2025 నుండి తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో పాటు			

షెడ్యూలు-సి

పార్ట్-1 : ఏమి లేదు, పార్ట్-2 : బ్యాంకుకు తనఖావుంచబడిన స్థిరాస్తి వివరములు దస్తావేజులలో పేర్కొన్న తనఖావుంచబడిన దస్తావేజులు/డీడ్స్ (షెడ్యూలు బి)

స్థిరాస్తి వివరములు :

షెడ్యూలు నెం.1 : యన్‌టిఆర్ జిల్లా, పడమట యస్ఆర్ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.16307/2023 ప్రకారం శ్రీ సజ్జా సురేష్, తండ్రి : సుబ్బారావు(లేటు)కు చెందిన ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, చల్లపల్లి సబ్ రిజిస్ట్రీ పరిధిలో చల్లపల్లి గ్రామము మరియు గ్రామపంచాయతీ, సజ్జావారి వీధి, అసెస్‌మెంట్ నెం.198, ఆర్.యస్.నెం.294/1-5, పాత డోరు నెం.2-7 నందు 459.40 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలము అందులో 384.118 చ॥మీ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్డ్ రెసిడెన్షియల్ ఇంటికి సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: బైపాస్ రోడ్, దక్షిణం: సజ్జా రామకోటయ్య యొక్క ఆస్తి, పడమర: రోడ్, ఉత్తరం: సజ్జా కాశి అన్నపూర్ణమ్మ యొక్క ఆస్తి.

షెడ్యూలు నెం.2 : గుంటూరు జిల్లా, నల్లపాడు యస్ఆర్ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.2182/2022 ప్రకారం శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్‌కు చెందిన ఆస్తి : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో, ఏటి అగ్రహారం ఎక్స్‌టెన్షన్, నల్లపాడు గ్రామము లో అసెస్‌మెంట్ నెం.1021219778, డి.నెం.119, ప్లాట్ నెంబర్లు 17 మరియు 16 లోని డోరు నెం.92-34/7-201 నందు మొత్తం 362-83 చ॥గ॥లు లేదా 303-36 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఇంటి స్థలములో నిర్మించిన "సాయి శ్రేష్ఠ ప్యారడైజ్" అపార్ట్‌మెంట్ లో ప్లింత్ ఏరియా 1097 చ॥అ॥ల (ఉమ్మడి ఏరియా మరియు పార్కింగ్ ఏరియా కలుపుకొని) విస్తీర్ణముగల గ్రౌండ్ ఫ్లోర్ లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.201 కు చెందిన అవిభాజ్యపు ఉమ్మడి భాగమైన 36-28 చ॥గ॥లు లేదా 30-33 చ॥మీ॥ల విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: ఉమ్మడి వరండా, మెట్లు మరియు లిఫ్ట్, దక్షిణం: శూన్యాకాశము, పడమర: శూన్యాకాశము, ఉత్తరం: శూన్యాకాశము.

షెడ్యూలు నెం.3 : గుంటూరు జిల్లా, నల్లపాడు యస్ఆర్ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.2181/2022 ప్రకారం శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్‌కు చెందిన ఆస్తి : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో, ఏటి అగ్రహారం ఎక్స్‌టెన్షన్, నల్లపాడు గ్రామము లో అసెస్‌మెంట్ నెం.1021219778, డి.నెం.119, ప్లాట్ నెంబర్లు 17 మరియు 16 లోని డోరు నెం.92-34/7-201 నందు మొత్తం 362-83 చ॥గ॥లు లేదా 303-36 చ॥మీ॥ల విస్తీర్ణముగల ఇంటి స్థలములో నిర్మించిన "సాయి శ్రేష్ఠ ప్యారడైజ్" అపార్ట్‌మెంట్ లో ప్లింత్ ఏరియా 1097 చ॥అ॥ల (ఉమ్మడి ఏరియా మరియు పార్కింగ్ ఏరియా కలుపుకొని) విస్తీర్ణముగల గ్రౌండ్ ఫ్లోర్ లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.202 కు చెందిన అవిభాజ్యపు ఉమ్మడి భాగమైన 36-28 చ॥గ॥లు లేదా 30-33 చ॥మీ॥ల విస్తీర్ణమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: శూన్యాకాశము, దక్షిణం: శూన్యాకాశము, పడమర: ఉమ్మడి వరండా, మెట్లు మరియు లిఫ్ట్, ఉత్తరం: శూన్యాకాశము.

షెడ్యూలు నెం.4 : గుంటూరు జిల్లా, తెనాలి యస్ఆర్ఒ లో రిజిస్టర్డ్ కాబడిన దస్తావేజు నెం.3671/2023 ప్రకారం శ్రీ సజ్జా నితిన్ చక్రవర్తి, తండ్రి : సజ్జా సురేష్‌కు చెందిన ఆస్తి : ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, కంకిపాడు మండలం, సూర్యా నగర్ వెంచర్ దగ్గర, గొడవర్రు గ్రామము, డివిజన్ నెం.312/1, అడంగల్ ప్రకారం 312/1ఎ, సమీప డోరు నెం.1-83 నందు 5929.00 చ॥గ॥లు లేదా 4957.00 చ॥మీ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు: తూర్పు: మల్లెల విజయలక్ష్మి మరియు ఇతరుల యొక్క ఆస్తి, దక్షిణం: కొనేరు శ్రీకృష్ణ మూర్తి యొక్క ఆస్తి, పడమర: యలమంచిలి వెంకట నారాయణ రావు యొక్క ఆస్తి మరియు లేఅవుట్ రోడ్‌కు వెళ్ళు నడకమార్గం, ఉత్తరం: కొనేరు దిలీప్ కుమార్ యొక్క ఆస్తి.

పైన పేర్కొన్న ఋణగ్రహీతలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్ (63640), విజయవాడ, కృష్ణా జిల్లా నుండి లోన్స్ / అడ్వాన్స్‌ల రూపంలో ఋణసౌకర్యములను పొందియున్నారు. మీరు పొందిన ఋణము తిరిగి చెల్లించనందున యన్‌పిఎగా వర్గీకరింపబడి పైన పేర్కొనబడిన సొమ్ము బకాయిగా వున్నది. మేము ఇప్పటికే 20-11-2025 తేదీ గల డిమాండ్ నోటీసు సెక్యూరిటైజేషన్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద తిరుగు రశీదుతో రిజిష్టర్ పోస్టు ద్వారా పంపించగా అట్టి నోటీసు తిరిగి వచ్చినందున/ ఋణగ్రహీత సంతకములు సరిగా లేనందున పత్రికా మూలకముగా మీకు మరలా నోటీసు జారీచేయడమైనది. సెక్షన్ 13(4) చట్టం క్రింద 60 రోజులలోపు పైన చెప్పిన మొత్తాన్ని చెల్లించని పక్షంలో బ్యాంకుకు తనఖావుంచిన సెక్యూరిటీ ఆస్తులను స్వాధీనం చేసుకొనగలమని మా అభిప్రాయాన్ని తెలియచేయడమైనది.

మీకు ఇస్తున్న సూచనలు : 1) అసలు నోటీసు కాపీ/నోటీసుకు సంబంధించిన సమగ్ర వివరములను, అధీకృత అధికారి నుండి పొందవచ్చునని సూచించబడినది. 2) SARFAESI యాక్ట్ క్రింద తదుపరి చర్యలకు పాల్పడకుండా వుండేందుకు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు వడ్డీ, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించవలసి వుంటుంది.

ప్రదేశం : విజయవాడ, తేది : 20-11-2025 సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌యమ్‌ఇ బిసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ.

తనకు పుట్టలేదన్న అనుమానంతో..
కన్నకొడుకునే చంపిన తండ్రి

- మెదక్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కన్న ప్రేమను మరచి, అనుమానంతో ఓ తండ్రి కసాయిగా మారాడు. తనకు పుట్టలేదన్న అనుమానంతో మూడేళ్ల చిన్నారి అని కూడా చూడకుండా తాడుతో ఉరివేసి హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా రూరల్ మండలం పెద్దబాయి తండాలో కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం.. పెద్దబాయి తండాకు చెందిన భాస్కర్‌కు, ఆరేళ్ల క్రితం తిమ్మక్కపల్లి తండాకు చెందిన ఓ మహిళతో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కుమారుడున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల భాస్కర్ తన భార్యను కొట్టడంతో మనస్తాపానికి గురైన ఆమె తన కుమారుడిని భాస్కర్ వద్దే వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లి దగ్గర లేని సమయంలో కుమారుడిని సంరక్షించాల్సిన తండ్రి, ఆ చిన్నారి తనకు పుట్టలేదని అనుమానం పెంచుకున్నాడు. పసివాడని కూడా చూడకుండా తాడుతో మెడకు ఉరి బిగించి హతమార్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

గాదె ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం

- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్యను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలో ఎన్‌ఐఏ పోలీసులు గాదె ఇన్నయ్యపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం భౌతికంగా నిర్మూలిస్తున్నదనీ, మావోయిస్టులు చర్చలకు సిద్ధపడినప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలత చూపట్లేదని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తున్న మేధావులపైనా, ప్రజాస్వామిక వాదులపైనా కక్షపూరిత వేధింపులకు పాల్పడటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇన్నయ్యపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'ఉపాధి' పేరు మార్చడం తగదు

- ఇది రాజకీయ కుట్ర
- టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టం పేరు మార్చడం సరికాదని, మహాత్మా గాంధీ పేరు తొలగించి ఉపాధి చట్టం ఉసురు తీయొద్దని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఇది బిజెపి చేస్తున్న రాజకీయ కుట్రగా అభిప్రాయపడ్డారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ ఎక్స్ రోడ్డు వద్ద పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ తీసి, మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై మాట్లాడారు. గ్రామీణ పేదల చెమటతో నడిచే చారిత్రాత్మక ఉపాధి చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడం గాంధీజీకి మాత్రమే కాదు, దేశంలోని కోట్లాది గ్రామీణ పేదలకు చేసిన ఘోర అవమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ పథకానికి నిధులు తగ్గించడం, బకాయిలు పెంచడం, పనిదినాల్లో కోతలు విధించడం ద్వారా గ్రామీణ ఉపాధి హక్కును కేంద్ర ప్రభుత్వం బలహీనపరుస్తున్నదని ఆరోపించారు. ఇప్పుడు రాజకీయ ద్వేషంతో మహాత్మా గాంధీ పేరు కూడా తొలగించాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఈ పథకం ద్వారా గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు గణనీయంగా తగ్గాయని, నిరుపేద కుటుంబాలకు జీవనాధారం కలిగిందని తెలిపారు. గాంధీ పేరును తొలగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి సెక్రటరీ చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లపై కేంద్రం కుట్ర

- పెన్షనర్లు సామాజిక బాధ్యత వహించాలి : జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ రాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్రచేస్తోందని, దీన్ని సంఘటిత శక్తితో ఎదుర్కోవాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జాతీయ నాయకులు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టిఎపిఆర్‌పిఎ-టాప్రా) నల్లగొండ జిల్లా మహాసభలో సంఘం జాతీయ నాయకులు జనార్దన్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు నూకల జగదీష్ చంద్ర అధ్యక్షతన జరిగిన సభలో జనార్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి తప్పనిసరిగా పెన్షన్ అందించడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని అన్నారు. దాన్ని కాల రాసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యత్నిస్తున్నదని విమర్శించారు. ఆర్థిక సంక్షోభాన్ని బూచిగా చూపించి 2026 నుంచి పెన్షన్ పాలసీలో మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల చేతిలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం.. వారి సలహా మేరకే పెన్షన్‌పై దాడి చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ దివాళాకోరు విధానాలపై పోరాటానికి టాప్రా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. దేశంలో సామాజిక రుగ్మతలను తొలగించే బాధ్యత పెన్షనర్లపై ఉందన్నారు. 30 నుంచి 40 ఏండ్లకు పైగా ఉద్యోగం చేసి వృద్ధాప్యంలో ఉద్యోగ విరమణ పొందిన వారు వారి జీవనం కోసం ఇచ్చే పెన్షన్ బెనిఫిట్స్‌పై కుట్రలు చేయడం అన్యాయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతుందని విమర్శించారు. ఖజానాలో డబ్బులు లేవని తనను కోసినా డబ్బులు లేవని చెప్పడం ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డికి తగదన్నారు. ఈ మహాసభలో టాప్రా జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, టాప్రా రాష్ట్ర కమిటీ సభ్యులు రమేశ్, ఎల్.మాధవరెడ్డి, నాయకులు డాక్టర్ లింగా అరుణ, కృష్ణారెడ్డి, అబ్దుల్ ఖాదర్, కొక్కడాల గోవర్ధన్ పాల్గొన్నారు.

విబి ఆర్ ఎఎల జీ బిల్లును రద్దు చేయాలి

హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు ఎదుట బిల్లు ప్రతుల దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి నూతనంగా తెచ్చిన విబి జీ ఆర్ ఎఎల జీ బిల్లును రద్దు చేయాలని కెవిపిఎస్, టిజిఎస్ సంఘాలు డిమాండ్ చేశాయి. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య పార్కు వద్ద వీబీ జీ ఆర్ ఎఎల జీ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ ఎ జెండాను అమలు చేయడంలో భాగంగానే ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి రాముడి పేరుతో బిల్లు తీసుకొచ్చిందని విమర్శించారు. కూలీలకు చెల్లించే నిధులను ఎవరు చెల్లించాలనే స్పష్టత బిల్లులో లేదని అన్నారు. జాబ్‌కార్డుల రేషనలైజేషన్ పేరుతో ఇప్పటికే కోట్లాదిమంది ఉపాధి కూలీల కార్డుల తొలగింపు ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. ఇప్పుడు ఉపాధి పనులకు కూలీలకు చెల్లించే నిధులను ఎవరు చెల్లించాలనే దానిపై స్పష్టత లేదన్నారు. వీబీ జీ ఆర్ ఎఎల జీ పథకానికి వ్యతిరేకంగా ఈ నెల 22వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో జరగనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీలకతీతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. టీజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ మాట్లాడుతూ.. 20 ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం ద్వారా గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలు, పేద ప్రజలకి లబ్ది చేకూరుస్తున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. ఆర్థిక లోటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాష్ట్రాలు ఉపాధి హామీ పథకం నిధులను చెల్లించకపోతే ఉపాధి పనులే ప్రమాదంలో పడే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రజల ఉపాధికి తూట్లు పొడిచి, కోట్లాదిమంది పేద ప్రజల ఉపాధి దెబ్బ తీయడమే బిజెపి చెబుతున్న దేశభక్తా అని ప్రశ్నించారు. ప్రజలు జాతిపితగా పిలిచే మహాత్మా గాంధీ పేరును సైతం తొలగించి దేశ ప్రజలను అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. గాంధీని గాడ్సే హత్య చేస్తే గాడ్సే వారసులైన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి.. మహాత్మాగాంధీ పేరును తొలగించి మరోసారి హత్య చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త చట్టంలో పనికి హామీ లేకపోవడంతోపాటు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే విధంగా ఉందన్నారు. బ్యాంకులను లూటీ చేస్తున్న దొంగలకు లక్షల కోట్ల రూపాయలు తాయిలాల రూపంలో చెల్లిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఉపాధి కూలీలకు కేవలం లక్ష కోట్ల రూపాయలు చెల్లించలేమని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు ఆశయ్య మాట్లాడుతూ.. కోట్లాదిమంది ఉపాధి కూలీల పొట్టను కొట్టే విధంగా తెచ్చిన వీబీ ఆర్ ఎఎల జీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై బిజెపిదీ ద్వంద్వ వైఖరి

- బిసి మేధావుల ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎ వేణుకుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తున్నదనీ, బిసిలపై బిజెపి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నదని బిసి మేధావుల ఫోరం రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్ విమర్శించారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి, గవర్నర్ ద్వారా రాష్ట్రపతి వద్దకు చేరిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు గడచిన పార్లమెంట్ సమావేశాల్లోనూ, ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనూ అజెండాలో పెట్టకపోవడాన్ని బట్టే వాళ్ల చిత్తశుద్ధి అర్థమవుతున్నదని విమర్శించారు. కుల గణన సర్వే, డెడికేషన్ కమిషన్ నివేదిక, తెలంగాణ శాసనసభ ఆమోదం అన్నీ పూర్తయినా కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణకు లేని అడ్డంకులు బిసిల రిజర్వేషన్లకు ఎందుకు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్లో ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లును తక్షణమే పార్లమెంటులో ఆమోదించి తొమ్మిదో షెడ్యూల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల హక్కుల కోసం సాగుతున్న ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

- ఎలుకలు, కీటకాల నివారణపై స్పెషల్ ఫోకస్
- పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల సహకారం తప్పనిసరి : డిఎంఇ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఎలుకలు, కీటకాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని తెలంగాణ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్ వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో సమూల మార్పులు తీసుకురాబోతున్నామని తెలిపారు. వార్డుల్లో ఆహార పదార్థాల వినియోగంపై పూర్తి నిషేధం విధిస్తామని ప్రకటించారు. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల సహకారం కావాలని కోరారు. ఆస్పత్రుల్లో సురక్షిత, ఆరోగ్యకరమైన హీలింగ్ జోన్లను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రోగుల సహాయకులు వార్డుల్లో ఆహారం తినటం, మిగిలిన పదార్థాలను అక్కడే డబ్బాల్లో వేయడంతో ఎలుకల బెడద పెరుగుతోందని తెలిపారు. రోగుల సహాయకులు నిర్దేశించిన క్యాంటీన్లలో మాత్రమే ఆహారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఆస్పత్రి భవనాల్లోని పగుళ్ళు, రంధ్రాలను ఎలుకలు చొరబడకుండా సిమెంట్, ఇతర దృఢమైన పదార్థాలతో శాశ్వతంగా మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్లు, ఐసియులు, లేబర్ రూమ్‌లలో "జీరో-గ్యాప్" సీలింగ్ విధానాన్ని పాటిస్తూ పూర్తి స్టెరిలైజేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రుల్లో అంతటా మూతలు కలిగిన చెత్త డబ్బాలను మాత్రమే వినియోగిస్తున్నామని, నిల్వ ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామని వివరించారు. ఈ వ్యవస్థను మానిటర్ చేసేందుకు సూపర్ వైజర్లను నియమిస్తున్నామని తెలిపారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మైకుల ద్వారా, సైన్ బోర్డుల ద్వారా ప్రచారం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఆస్పత్రిలోనూ హెచ్‌ఐసిసి కమిటీలను ఏర్పాటు చేసి పెస్ట్ కంట్రోల్ లాగ్ బుక్‌ను నిర్వహిస్తున్నామని, సూపరింటెండెంట్ల పర్యవేక్షణలో నెలవారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

స్టూడెంట్స్ వర్క్ ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తున్న ఐఐఐడి మేనేజింగ్ కమిటీ సభ్యులు

'గీతం'ను సందర్శించిన హైదరాబాద్ ఐఐఐడి మేనేజింగ్ కమిటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటీరియర్ డిజైనర్స్ (ఐఐఐడి) ప్రాంతీయ చాప్టర్ మేనేజింగ్ కమిటీ సభ్యులు.. గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్చర్ విద్యా వ్యవస్థ, అక్కడి స్థితిగతులు, కీలకమైన మౌలిక సదుపాయాలను కమిటీ సమీక్షించింది. విద్యార్థులతో కమిటీ సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ వర్క్ ఎగ్జిబిషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆవిష్కరణ, డిజైన్ సున్నితత్వం, విద్యాపరమైన కఠోరతను ప్రతిబింబించే విద్యా ప్రాజెక్టుల ప్రత్యేక ప్రదర్శనను కూడా కమిటీ సభ్యులు వీక్షించారు. ఐఐఐడి ప్రతినిధి బృందాన్ని ఉద్దేశించి గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డైరెక్టర్ ఆర్. బందన్ కుమార్ మిశ్రా ప్రసంగించారు. ఆర్కిటెక్చర్ విద్యలో రాణించడానికి సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించడంతోపాటు ఐఐఐడి సహకారం ప్రాముఖ్యతనూ ప్రస్తావించారు. అర్థవంతమైన విద్య, వృత్తిపరమైన సహకారాల ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్శనను అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నిగ్ధ రాయ్ సమన్వయం చేశారు.

సమాజ మార్పునకు పుస్తకాలు దిక్సూచి

ప్రజాశక్తి - కల్చరల్

సమాజ మార్పునకు పుస్తకాలు దిక్సూచి అని మంచి గ్రంథాలు చదవడం జ్ఞానానికి మార్గం సుగమం చేస్తాయి అని నవ తెలంగాణ సంపాదకుడు రాంపల్లి రమేష్ అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో అనిశెట్టి రజిత వేదికపై పుస్తక స్ఫూర్తి పుస్తకం ఒక దారి దీపం శీర్షికన అభిప్రాయ గోష్ఠి' జరిగింది. మొదటి విభాగంలో రమేష్ మాట్లాడుతూ డిజిటల్ యుగం విజృంభిస్తున్న తరుణంలో పుస్తకాలకు కూడా ఆదరణ ఉందని బుక్ ఫెయిర్ వల్ల తెలుస్తోందని అన్నారు. బుక్ ఫెయిర్‌లో వివిధ భావాలకు చెందిన గ్రంథాల స్టాల్‌లు వల్ల ఒక విశ్వవిద్యాలయంలా అనిపిస్తూ ఉంది అని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రముఖ సినీ దర్శకుడు బి నర్సింగ్‌రావు మాట్లాడుతూ పుస్తక పఠనం పండుగ వంటిదని అన్నారు. నిరంతరంగా తాను చదివిన కాలం సువర్ణ కాలం అన్నారు. తన సంపాదనలో ఎక్కువ శాతం పుస్తకాల కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. ప్రాముఖ రచయిత్రి వసంత కన్నాబిరామ్ మాట్లాడుతూ తాము చేసే పనిపై విశ్వాసం ఉంటే విమర్శలు ఎదుర్కొనే ధైర్యం వస్తుందని అన్నారు. పుస్తక ప్రదర్శనలో నల భై ఏళ్ల క్రితం తాను రాసిన కత్తోర షడ్జమాలు కు ఇప్పటికీ జనాదరణ ఉండి తనకు సంతోషంగా ఉందని చెప్పారు. గత సమాజంలో ఉన్న భిన్నత్వం వైవిధ్యం నేడు తగ్గుతొందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకుబ్ ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి ప్రశంగ కర్తలను సత్కరించారు.

కొత్త సర్పంచులకు సవాళ్లే..

- పెండింగ్ బిల్లుల గందరగోళం
- అరకొర నిధుల మధ్య అభివృద్ధి జరిగేనా ..?
- అప్పులు చేసి గెలిచిన సర్పంచుల్లో ఆందోళన
- పాత బిల్లులు, అప్పులకు ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన సర్పంచ్‌లకు ఆది నుంచే సవాళ్లు ఎదురవ్వనున్నాయి. గ్రామపంచాయతీ సర్పంచులుగా బాధ్యతలు చేపట్టే వారికి పెండింగ్ బిల్లులు, కార్యదర్శులు చేసిన అప్పులు సమస్యగా మారనుంది. గత సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల్లో విలవిల్లాడారు. ప్రత్యేక అధికారుల పాలనలో డబ్బులు లేక గ్రామపంచాయతీల నిర్వహణ కోసం అస్తవ్యస్తంగా మారింది. కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలో.. పెండింగ్ బిల్లుల విషయంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఈసారి విద్యావంతులు, యువత ఎక్కువమంది సర్పంచులుగా గెలిచారు. అప్పుల కుప్పగా ఉన్న గ్రామపంచాయతీల నిర్వహణ వీరికి కష్టంగా మారనున్నది. ప్రత్యేక గ్రాంట్ ఇస్తే తప్ప అభివృద్ధి సాధ్యం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో 423 గ్రామపంచాయతీలున్నాయి. నాగర్‌కర్నూల్ -460, వనపర్తి 258, నారాయపేటలో -272, జోగులాంబ గద్వాల జిల్లాలో 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2083 మంది పంచాయతీ కార్యదర్శులున్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులకు ఎన్నాళ్లుగానో పేరుకుపోయిన సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గతంలో సర్పంచులుగా గెలిచిన వారు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్స్, గ్రామపంచాయతీలు, రైతు వేదికలు, శ్మశానవాటికలు తదితర వాటికోసం లక్షలు ఖర్చు చేశారు. ప్రత్యేక నిధులు రాకపోయినా అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశారు. ఒక్కో మాజీ సర్పంచ్‌కి ఐదు లక్షల నుంచి రూ.10 లక్షల దాకా పెండింగ్ బిల్లులు రావాల్సింది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్పల్లి గ్రామంలో గత సర్పంచికి ఎనిమిది లక్షలకు పైగానే బిల్లులు రావాల్సింది. ప్రత్యేక పాలన రెండేండ్ల కాలంలో మరో ఎనిమిది లక్షలు ఖర్చు చేసి గ్రామపంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులు చేశారు. రాణిపేట గ్రామపంచాయతీ పరిధిలో పాత సర్పంచ్‌కి ఐదు లక్షలు రావాల్సి ఉండగా, ప్రత్యేక బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు ఐదు లక్షలకుపైగానే ఖర్చు చేశారు. ఇలా ఒక్కో గ్రామానికి ఐదు లక్షల రూపాయలు అనుకున్నా రూ.100 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. 10 లక్షల అయితే రూ.200 కోట్లు పాత సర్పంచులకు బిల్లుల కింద చెల్లించాల్సింది. రెండేండ్ల నుంచి ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు చేసిన ఖర్చు సుమారు రూ.200 కోట్లకు పైగానే ఉంటుంది. పాత బిల్లులకే నిధులు లేని పరిస్థితుల్లో భవిష్యత్‌లో గ్రామాల అభివృద్ధి ఎలా అనేది నూతన సర్పంచులకు సవాల్‌గా మారింది.

పెండింగ్ బకాయిలు

బీఆర్‌ఎస్ హయాంలో గత సర్పంచులు ఐదేండ్లలో అనేక పనులు చేశారు. పనులు చేయని సర్పంచుల చెక్ పవర్‌ను గత ప్రభుత్వం రద్దు చేయించింది. పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసింది. దీంతో సర్పంచులు అప్పులు చేసి శ్మశానవాటికలు, రైతు వేదికలు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు, ట్రాక్టర్‌కు డిజిల్, అసంపూర్తి భవనాల నిర్మాణం పూర్తి చేశారు. వాటికి సంబంధించి గ్రాంట్లు రాకముందే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. బిల్లులు రాక.. అప్పులు తీరే దారి లేక చాలా మంది మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్ వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారు.

కొత్తగా సర్పంచులుగా ఎన్నికైన వారు

ఈసారి ఎక్కువమంది యువత, ఉన్నత చదువులు చదివిన వారు స్థానిక ఎన్నికలలో సర్పంచ్‌లుగా గెలుపొందారు. వీరు కొత్తగా రాజకీయాలకు రావడంతో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలనుకున్నారు. అయితే, మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు, పంచాయతీ కార్యదర్శులు చేసిన పనులకు సంబంధించి నిధుల వివరాలను పరిశీలించాక గ్రామాభివృద్ధిపై పునరాలోచనలో పడ్డారు. అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు లేకుండా ఎలా సాధ్యమని ఆందోళన చెందుతున్నారు.

సోమవారం బాధ్యతల్లోకి కొత్త సర్పంచులు

సోమవారం కొత్త సర్పంచులు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గజట్ విడుదల చేసింది. సర్పంచ్ బాధ్యతలు నిర్వహించడానికి పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కనీసం కుర్చీలు కూడా లేవని, తాము కూర్చోవడానికి కుర్చీలను కూడా తామే తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని పలువురు సర్పంచులు ఆవేదన చెందుతున్నారు.

ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలి

నాగర్ కర్నూల్ జిల్లా నడిగడ్డ సర్పంచ్ వామన్‌గౌడ్

పాతబకాయలు తీర్చడానికే మాకు రెండేండ్ల సమయం పడుతుంది. ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వకపోతే గ్రామపంచాయతీల నిర్వహణ కష్టమే. పంచాయతీ కార్యదర్శులకు, మాజీ సర్పంచుల బిల్లుల కోసం రూ.10 లక్షలు కావాలి. కేంద్ర, రాష్ట్ర నిధులతోపాటు 10 లక్షల ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలని కోరుతున్నాం.

అప్పులు తీరేదెలా ?

బోయిన్పల్లి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు-మహబూబ్‌నగర్

పాత సర్పంచుల అప్పులు మిడ్జిల్ మండలం బోయిన్పల్లి గ్రామంలో సుమారు రూ.ఏడు లక్షల దాకా ఉన్నాయి. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, కేంద్రం నిధులు కలిసి రెండేళ్ల ఇచ్చినా అప్పులు తీరవు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీల నిర్వహణ ఎలా చేయాలి. రెండేళ్లుగా పంచాయతీ నిర్వాణ కోసం మేము అప్పులు చేసి ఖర్చు పెట్టాం. మా డబ్బులు ఎలా తీసుకోవాలి.

వడ్డీ వ్యాపారుల వేధింపులతో
దంపతుల ఆత్మహత్య

- మూడేళ్ల చిన్నారి పరిస్థితి విషమం
- సిద్దిపేట జిల్లా బెజ్జంకిలోని దాచారంలో విషాదకర ఘటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇతరులకు ఆర్థిక అవసరాల కోసం.. వడ్డీ వ్యాపారుల వద్ద మధ్యవర్తిగా సంతకం చేసి అప్పులు ఇప్పించగా.. ఆ అప్పులిచ్చిన వారు డబ్బుల కోసం హర్షను వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వారి మూడేళ్ల చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం దాచారంలో ఆదివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లకొండ శ్రీ హర్ష (33), రుక్మిణి (28) దంపతులు.. బెజ్జంకిలో రినో సారీస్, రెడీమెడ్స్, కిడ్స్ బట్టల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మూడేళ్ల కుమార్తె హరిప్రియ ఉంది. కాగా, ఇతరుల అవసరాల కోసం శ్రీ హర్ష మధ్యవర్తిగా ఉండి.. వడ్డీ వ్యాపారుల వద్ద డబ్బులు ఇప్పించారు. ఆ డబ్బులు చెల్లించాలని కొన్ని రోజులుగా వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల వడ్డీ వ్యాపారులు హర్ష కారును తీసుకువెళ్లినట్టు తెలుస్తోంది. దాంతో వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురైన ఆ దంపతులు పురుగుల మందు తాగి.. కూతురికి పురుగుల మందు తాగించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాగా, స్పృహలోకి వచ్చిన హరిప్రియ తల్లిదండ్రులు పడిఉండడంతో కేకలు వేసింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి తలుపు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే రుక్మిణి మృతి చెందారు. కొన ఊపిరితో ఉన్న శ్రీహర్షతోపాటు చిన్నారి హరిప్రియను చికిత్స కోసం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో హర్ష మృతి చెందారు. చిన్నారి హరిప్రియ సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం హరిప్రియ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. కాగా, తమ మృతికి ఐదుగురు వ్యక్తులు ముఖ్య కారకులుగా పేర్కొంటూ.. వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సిపి, సిఐ, ఎస్‌ఐకు మృతుడు రాసిన సుమారు 10 పేజీల మరణ వాంగ్మూలం లేఖ బయటపడింది. అంతేకాకుండా.. "అమ్మ, నాన్నా, తమ్ముడు.. క్షమించండి.. తమ్ముడు నీ స్వార్థం చూసుకోకు.. నాన్న బాధను కూడా అర్థం చేసుకో.. ఎప్పుడూ డబ్బు అని నాన్నను బాధ పెట్టకు.. అమ్మ, నాన్నను బాగా చూసుకో.. ఇల్లు, కారు అమ్మి అన్ని అప్పులు తీర్చేయండి.. సారీ.. రా" అంటూ శ్రీహర్ష లేఖలో రాసిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కాగా, ఎసిపి రవీందర్ రెడ్డి, సిఐ శ్రీను, ఎస్‌ఐ సౌజన్య ఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసి గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు.

అందెశ్రీ పాటలకు నృత్య రూపకం దృశ్య కావ్యం

ప్రజాశక్తి కల్చరల్

అందెశ్రీ రచించిన జై తెలంగాణ జై జై తెలంగాణ పాటకు ఇందిరా పరాశర శిష్య బృందం లయ శృతికి అనుసంధానం చేస్తూ నర్తించి ప్రేక్షకుల్ని సమ్మోహితులను చేశారు.

ఎన్‌టిఆర్ స్టేయంలో జరుగుతున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో కీర్తి న త్య అకాడమీ సజన శిష్య బ ందం అనిశెట్టి రజిత వేదిక పై కూచిపూడి నాట్య శైలి లో పలు అంశాలు ప్రదర్శించారు అనంతరం ఇందిరా పరాశర శిష్య బృందం అందెశ్రీ గీతాలకు నృత్య రూపకం దృశ్య కావ్యంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో యాదాద్రి భువన గిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు పాల్గొని మాట్లాడుతూ డిజిటల్ మీడియా ను పక్కన పెట్టి స్వామి దయానంద సరస్వతి బ్యాక్ టు వేదాస్ అన్న పిలుపు మేరకు యువత నేడు బ్యాక్ టు బుక్స్ వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు పుస్తక పఠనం వ్యసనంగా మారాలి అన్నారు.

బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకుబ్ ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి కార్యదర్శి వాసు జర్నలిస్ట్ శ్రీనివాస్ రావులు పాల్గొని నర్తకీమణులను సత్కరించారు.